

చీఫ్ ఎడిటర్: దొండ్లవారు భవ్య (జర్నలిస్ట్)

గ్లోబల్ వార్త

RNI.No:-APTEL/26/A2902

జాతీయ తెలుగు దినపత్రిక

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 61 | 02 -11-2026 | సోమవారం | పేజీలు -4 | వెల-రూ. 5



పులివెందుల ఆర్వో ఆఫీస్ వద్ద వైఎస్ జగన్ నిరసన

గ్లోబల్ వార్త - పులివెందుల

ఆర్వో కార్యాలయం ముందు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరసన తెలిపారు. 70 మంది వైఎస్సార్‌సీపీ ఏజెంట్లతో కలిసి బైఠాయించారు. ఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో చిన్నయ్యతో మాట్లాడిన వైఎస్ జగన్.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డుకోవడంపై ప్రశ్నించారు. ఎన్నికల అక్రమాలపై ఆయన ఫిర్యాదు చేశారు. 'ఎలక్షన్ అంటే పోటీ జరగాలి. ఎక్కడ చూసినా టీడీపీ గూండాలే కనబడుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు లేవు" అంటూ అధికారులను వైఎస్ జగన్ నిలదీశారు. "అధికారులు మౌనంగా ఉంటే ప్రజా స్వామ్యానికే ప్రమాదం. ఇలా జరిగితే వీటిని ఎన్నికలంటారా?. ఎన్నికల్లో అక్రమాలపై ఆధారాలన్నీ ఉన్నాయి. బిహార్ పరిస్థితులను ఏపీలో చూస్తున్నాం. మాజీ సీఎం నియోజకవర్గంలో ఈ పరిస్థితులేంటి?" అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతకుముందు.. వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళనకు దిగారు. ఏజెంట్లను అనుమతించకుండా, దాడులకు దిగడంపై చైర్‌పర్సన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ, ఇతర అభ్యర్థులు నిరసన చేపట్టారు. రిపోలింగ్ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉదయాన్నే బూత్‌లను ఆక్రమించుకుని రిగ్గింగ్ చేసుకున్నారన్న వైఎస్సార్‌సీపీ నేతలు.. ఏజెంట్లు, ఓటర్లు, మీడియా అనేది లేకుండా ఇష్టారీతిన దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆర్వో కార్యాలయంలోకి వెళ్లకుండా అవినాష్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. అభ్యర్థులు వస్తున్నారని తెలిసి ఆర్వో కార్యాలయానికి తాళం వేశారు. జరిగిన అక్రమాలు దేశమంతా చూసిందని.. వెంటనే ఎస్ఈసీ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది.

ఢిల్లీ వ్యాపారాలను కేంద్రమే దెబ్బ తీస్తోంది

రాహుల్ గాంధీ ఆరోపణలు



గ్లోబల్ వార్త - ఢిల్లీ

ఢిల్లీ వ్యాపారుల విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం తీవ్రమవుతోంది. దీపావళి పండుగ సీజన్‌లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశరాజధానిలోని వ్యాపారాలను ఇండి కూటమి దెబ్బతీస్తోందని బీజేపీ ఆరోపణలు చేస్తోంది. దీంతో వర్తకులకు వేల కోట్ల రూపాయల నష్టం వస్తోందని అంటోంది. మరోవైపు వ్యాపారులు నష్టపోవడానికి కేంద్రమే కారణమని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఢిల్లీలోని దుకాణాలను కాషాయ పార్టీ బలవంతంగా మూసివేయిస్తోందంటూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఇండి కూటమి ర్యాలీకి తరలివస్తున్న వారిని ఢిల్లీ మార్కెట్లలో షాపింగ్ చేయాలని తాము కోరామని రాహుల్ గాంధీ వీడియోలో చెప్పారు. అయితే ఇక్కడి దుకాణాలను బీజేపీ బలవంతంగా మూసివేయించిందని ఆయన ఆరోపించారు. దీనిబట్టి ఢిల్లీ వ్యాపారాలను దెబ్బతీస్తోంది ఎవరో అర్థమవుతోందని పేర్కొన్నారు.

కాగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఈరోజు రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీపావళి సమీపిస్తున్న వేళ.. ఈ నిరసనలు తమ వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని వ్యాపారస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండగ షాపింగ్ కోసం ప్రజలు దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి వస్తారని, ఇక్కడ రూ.25 వేల కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని చెబుతున్నారు. అందుకే ర్యాలీని వాయిదా వేయాలంటూ ఇటీవల వారు రాహుల్‌కు లేఖ కూడా రాశారు.

ఇండియా కూటమి ర్యాలీలో పాల్గొనం: సీజేపీ



ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొనబోమని, తాము తటస్థంగా ఉంటామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. తమ సంస్థ గుర్తింపును కాపాడుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని దీప్కే కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఇటీవలే జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన సీజేపీ ఆందోళనలకు మద్దతు ఇచ్చినందుకు మమతకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అలాగే తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను పోలీసులు అరెస్టు చేసినపుడు కూడా మమత తమ


తరువాయి 2లో

ఏపీకి మరో తుఫాన్ ముప్పు

సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

గ్లోబల్ వార్త - అమరావతి

అర్నాబ్ తుఫాన్ నుంచి ఆంధ్రప్రదేశ్ కోలుకోకముందే మరో తుఫాన్ రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. ఏపీకి మరో తుఫాన్ ప్రమాదం పొంచి ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్రమత్తమయ్యారు. దీనిపై ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. మరోవైపు, రేపటి ఢిల్లీ పర్యటనను కూడా ఆయన రద్దు చేసుకున్నారు. సమీక్ష సందర్భంగా అర్నాబ్, రాబోయే తుఫాన్ ప్రభావంపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ మేరకు తుఫాన్ ప్రభావం, వర్షాలు, గాలుల అంచనాలు, జలాశయాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాబోయే ప్రమాదం గురించి సీఎంకు అధికారులు కీలక వివరాలు వెల్లడించారు. రాబోయే రోజుల్లో వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అనంతరం తుఫాన్‌గా మారి నవంబరు 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వివరించారు. నవంబరు 3న ఉదయం బాపట్ల సమీపంలో తీవ్ర తుఫాన్‌గా తీరం దాటే అవకాశం ఉందని చెప్పారు. ఆ సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు నవంబరు 2న దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. అలాగే నవంబరు 3, 4 తేదీల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఏలూరు జిల్లాలో 9 మండలాలు, కృష్ణా జిల్లాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్ల జిల్లాలో ఒక మండలంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసినట్లు వివరించారు. నవంబరు 3న జిల్లా సగటు వర్షపాతం ఏలూరులో సుమారు 179 మిల్లీమీటర్లు, కృష్ణాలో 163, ఎన్టీఆర్‌లో 161, పశ్చిమ గోదావరిలో 147, గుంటూరులో 119, బాపట్లలో 104 మిల్లీమీటర్లు ఉండవచ్చని చంద్రబాబుకు అధికారులు తెలిపారు. నవంబరు 3న బుడమేరుకు సుమారు 32,500 క్యూసెక్కుల వరద ప్రవాహం రావచ్చని, ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర వాగుల్లో భారీ వరదకు అవకాశం ఉందని వెల్లడించారు. బలమైన గాలుల వల్ల 12 జిల్లాల్లో సుమారు 12,102 నుంచి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, అర్నాబ్ తుఫాన్ నష్టం, సహాయక చర్యలపైనా సీఎంకు అధికారులు కీలక విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా అర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణపై చంద్రబాబు ఆరా తీశారు. ఈరోజు రాత్రికి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు ఆయనకు తెలిపారు. అలాగే, రాబోయే తుఫాన్ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే తరలించాలని, వరద ప్రభావిత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆజ్ఞాపించారు. తుఫాన్ సమయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



ఓటు వేయకుండానే బెంగళూరు వెళ్లిపోయిన జగన్

గ్లోబల్ వార్త - కడప: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ బెంగళూరు నుంచి పులివెందులకు వచ్చిన వైసీపీ అధినేత జగన్.. చివరకు తన ఓటు హక్కు వినియోగించుకోకుండానే తిరుగుపయనమయ్యారు. ఎన్నికలు జరిగిన తీరు సరిగా లేదని ఆరోపిస్తూ ఓటు వేయబోనని ప్రకటించారు. అంతేకాదు.. రీపోలింగ్ పెడితేనే బెంగళూరు నుంచి వచ్చి ఓటు వేస్తానని అన్నారు. ఎన్నికల పోలింగ్ జరిగిన తీరు చూస్తే సంస్కరణలు ఎంత అవసరమో తెలుస్తోందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎవరి చేతుల్లో ఉందో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు.

ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. పులివెందులలో తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చిన వైసీపీ అధినేత జగన్.. మీడియా ముందుకు వచ్చి పోలింగ్ సరళిపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో 70 మంది వైసీపీ ఏజెంట్లను బయటకు పంపించారని అన్నారు. అంతేకాదు.. ఇదే అంశంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తానన్నారు. ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లి కార్యాలయం ఎదుట బైఠాయించి హంగామా సృష్టించారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు జగన్. ఈ క్రమంలోనే జగన్ తాను ఓటు వేయబోనని.. రీ పోలింగ్ పెడితేనే ఓటు వేస్తానంటూ బెంగళూరుకు వెళ్లిపోయారు.



జగన్ తీరుపై విమర్శలు..

వైసీపీ అధినేత జగన్ తీరుపై ప్రజాస్వామ్యవాదులు, అధికార కూటమి పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న జగన్.. ఓటు హక్కు వినియోగించుకోకుండా ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారంటూ విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ ఇలా ప్రవర్తిస్తున్నారని అంటున్నారు.

జగన్ రాజకీయ సమాధికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధం

బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి



గ్లోబల్ వార్త - కడప :

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాజకీయ సమాధికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి పులివెందులతో సహా అన్ని చోట్లా ఘోర ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ కుట్రలు, డ్రామాల బ్రేమ్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. త్వరలోనే ప్రజాస్వామ్యం గెలవబోతోందని తెలిపారు. జమ్మలమడుగుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను పులివెందుల్లో గూండాయిజం చేయడం ఏమిటని వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

జగన్ అనుకూల మీడియాలో తన పేరు పదేపదే ప్రస్తావించడం సరైనా పద్ధతి కాదని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గతంలో వైఎస్ వివేకానంద రెడ్డిని హత్య చేసి ఆ నేరం తమపై నెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పులివెందుల్లో వాళ్లే గుండాయిజం చేసి ఆ తప్పు తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

11 సీబీఐ, 9 ఈడీ కేసుల్లో ఉన్న దొంగలే నీతి నిజాయితీల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక భయంతోనే తమపై కుట్రలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాప్తాడులో గాయపడిన విద్యార్థినికి శస్త్రచికిత్సలు విజయవంతం

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి



గ్లోబల్ వార్త - అమరావతి

రాప్తాడు హైస్కూలులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినికి శస్త్రచికిత్సలన్నీ విజయవంతంగా పూర్తయ్యాయని వైద్యులు వెల్లడించారని ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రస్తుతం బాలికని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐ×జఖ)కు తరలించి, నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉంచారని వివరించారు. బాలిక కోలుకోవాలని ప్రతి ఒక్కరూ చేసిన ప్రార్థనలు ఫలించాయని చెప్పారు

చికిత్సలో కీలకమైన దశ విజయవంతంగా పూర్తి కావడం ఎంతో ఊరటనిచ్చిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య బృందానికి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థిని త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, మళ్లీ చిరునవ్వులు చిందించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ఏపీ విద్యా శాఖ మంత్రి లోకేశ్ స్పందించారు.

మరోవైపు బెంగళూరుకు మంత్రి లోకేశ్ బయలుదేరి వెళ్లనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఓల్డ్ హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి నారా లోకేష్ చేరుకుంటారు. ఆ ఆసుపత్రిలో రాప్తాడులో ఉన్మాది దాడిలో గాయపడి.. చికిత్స పొందుతున్న విద్యార్థినిని ఆయన పరామర్శించనున్నారు. అలాగే బాలికకు అందిస్తున్న చికిత్సపై వైద్యులతో మంత్రి లోకేశ్ చర్చిస్తారు.

బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆయన కోరనున్నారు. అనంతరం చిన్నారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పనున్నారు.

70 మంది వైసీపీ పోలింగ్ ఏజెంట్లతో ఆర్వో కార్యాలయానికి ఎంపీ అవినాశ్ రెడ్డి

అడ్డుకున్న పోలీసులు

గ్లోబల్ వార్త - కడప జిల్లాలోని పులివెందులలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. సుమారు 70 మంది వైసీపీ పోలింగ్ ఏజెంట్లతో ఎంపీ అవినాశ్ రెడ్డి ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. అయితే.. ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ పోలింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో అవినాశ్ రెడ్డి, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో ఆర్వో కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇప్పటికే ఎన్నికల సందర్భంగా పులివెందులలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో తాజా ఘటన రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. 70 మంది వైసీపీ ఏజెంట్లతో ఎంపీ కార్యాలయానికి రావడం.. పోలీసులు ఆయనను అడ్డుకోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

పులివెందులలో జగన్ తీరుపై టీడీపీ వర్గాల ఆగ్రహం..

ఇదిలా ఉంటే.. పులివెందులలోని 70 పోలింగ్ బూత్‌లలో వైసీపీ ఏజెంట్లు లేరంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలపైనా టీడీపీ వర్గాలు స్పందించాయి. 70 మంది పోలింగ్ ఏజెంట్లతో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ఆర్వో కార్యాలయానికి చేరుకోవడం వల్ల అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకుందని విమర్శించారు. తమ పార్టీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లకు పంపించుకోలేని వైసీపీ నాయకులు, ఆ విషయాన్ని



తరువాయి 2లో



శ్రీవారి ఆలయంలో 495 ఏళ్ల నాటి శాసనం

అచ్యుతదేవరాయల కాలం నాటిదిగా గుర్తింపు

తిరుమల శ్రీవారి ఆలయంలో విజయనగర సామ్రాజ్య పాలకుడు అచ్యుతదేవరాయల కాలంనాటి అరుదైన శాసనం వెలుగులోకి వచ్చింది. సుమారు 495 ఏళ్ల నాటి ఈ శాసనాన్ని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) అధికారులు ఇటీవల అచ్చు తీశారు. ఆలయంలోని మూడో ప్రాకారం గోడపై ఈ శాసనం ఉన్నట్టు ఏఎస్ఐ ఎపిగ్రఫీ విభాగ డైరెక్టర్ కె.మునిరత్నంరెడ్డి వెల్లడించారు. క్రీ.శ 1531 ఫిబ్రవరి 13 నాటి ఈ శాసనం తమిళ భాషలో ఉంది. శక సంవత్సరం 1462 శార్వరి నామ సంవత్సరం కుంభ మాసం, బహుళ తదియ, ఆదివారంనాటి వివరాలున్నాయి. తిరుమలలో నివసించే ఏకాంగి శ్రీవైష్ణవుల్లో ఒకరైన పేరరుళాళయ్యన్ దానధర్మ వ్యవహారాన్ని ఈ శాసనం వివరిస్తోంది.

కర్నూలులో రూ.76 లక్షల నగదు సీజ్

గ్లోబల్ వార్త – కర్నూలు

కర్నూలు నగరంలో ఓ వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి స్నేహితుడి ఇంట్లో పోలీసులు రూ.76 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని 27వ వార్డు కార్పొరేటర్‌గా వైసీపీ తరఫున పోటీ చేస్తున్న మహేశ్వరరెడ్డి స్నేహితుడు డాక్టర్ అమర్‌నాథ్ రెడ్డి ఇంట్లో ఈ నగదును శనివారం రాత్రి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గుర్తించారు. ఈ నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తెలిపారు.

నంద్యాలలో వైసీపీ అభ్యర్థిపై కేసు

నంద్యాల మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డు వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థి పురందర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పురందర్ తన స్నేహితుడు బోయ వన్నూరుతో కలిసి శనివారం ఓటర్లకు డబ్బు పంచుతుండగా పోలీసులు గుర్తించారు. వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రూ.45,510 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నందికొట్కూరులో..

నందికొట్కూరు పట్టణంలో ఓటర్లకు డబ్బు పంచుతుండగా వైసీపీ నేతలు ఇద్దరిని పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన రత్నస్వామి నుంచి రూ.1.43 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. బైరెడ్డి నగర్‌లోని కోట హైస్కూల్ వద్ద మంజునాథ్ నుంచి రూ.1,01,000 నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.



రాజకీయమంటే అంద్దలం కాదు: జస్టిస్ ఎన్వీ రమణ

'రాజకీయమంటే అందలం ఎక్కడం కోసం కాదు. సేవా దృక్పథం కలిగి ఉండాలి. నేటి రాజకీయాల్లో విలువలు పూర్తిగా పోయాయి' అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో శనివారం జరిగిన పాటిబండ్ల సీతారామయ్య 144వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ పాటిబండ్ల సీతారామయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటిసారిగా పాటిబండ్ల సీతారామయ్య పేరుపై జీవన సాఫల్య పురస్కారాన్ని రాజ్యసభ మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీకి జస్టిస్ ఎన్వీ రమణ ప్రదానం చేశారు. ఈ సభకు మాజీ డీజీపీ ఎం.మాలకొండయ్య అధ్యక్షత వహించారు.

ఫేక్ సమాగమ్ యాప్‌లతో జాగ్రత్త

కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) పేరుతో గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న నకిలీ మొబైల్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) హెచ్చరించింది. కేవీఎస్ సమాగం, కేవీఎస్ సంవాద్ పేర్లతో కొన్ని ఫేక్ యాప్‌లు గూగుల్ ప్లేస్టోర్‌లో చలామణిలో ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో కేవీఎస్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ నకిలీ యాప్‌లతో కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. వాటిని డౌన్‌లోడ్ చేసుకోవడం, వ్యక్తిగత వివరాలు నమోదు చేయడం వంటివి చేస్తే డేటా దుర్వినియోగం కావడంతోపాటు ఆర్థిక మోసాలకూ గురయ్యే ప్రమాదం ఉందని కేవీఎస్ హెచ్చరించిందికేవీఎస్ సమాగం సేవలు తమ వెబ్ పోర్టల్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని, యూజర్లు వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఆ పోర్టల్‌ను యాక్సెస్ చేయవచ్చని కేవీఎస్ సూచించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్ల కోసం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాగం మొబైల్ యాప్‌ను విడుదల చేయలేదని తెలిపింది. అలాగే 'కేవీఎస్ సంవాద్' పేరుతో ప్రచారంలో ఉన్న పేరెంట్ కనెక్ట్ మొబైల్ యాప్‌ను కూడా ఇంకా ప్రారంభించలేదని వెల్లడించింది. **తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి**

నకిలీ యాప్‌లపై తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కేంద్రీయ విద్యాలయాల ప్రిన్సిపాళ్లను కేవీఎస్ ఆదేశించింది. పాఠశాల వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపులు, విద్యాలయ నిర్వహణ కమిటీ (వీఎంసీ) సమావేశాలు, పేరెంట్-టీచర్ సమావేశాల ద్వారా ఫేక్ యాప్ లపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. కేవీఎస్‌కు చెందినట్లుగా చెప్పుకునే ఏ మొబైల్ యాప్‌నైనా అధికారికంగా ధ్రువీకరించుకున్న తర్వాతే డౌన్‌లోడ్ చేసుకోవాలని, అనుమానాస్పద యాప్‌లలో నమోదు చేసుకోవడం లేదా వ్యక్తిగత వివరాలు అందించడం వంటివి చేయరాదని తల్లిదండ్రులు, విద్యార్థులకు సూచించాలని తెలిపింది.

ఇండియా కూటమి ర్యాలీలో....

(మొదటి పేజీ తరువాయి)

వెంట ఉన్నారని తెలిపారు. కాగా.. రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి చేస్తున్న ర్యాలీపై మాట్లాడుతూ.. ర్యాలీకి మద్దతు తెలుపుతున్నామని దీప్కే వెల్లడించారు. అయితే, ఆ ప్రదర్శనలో తాము పాల్గొనబోమని చెప్పారు. 'సీజేపీ అనేది ఒక స్వతంత్ర సంస్థ. మేము మా గుర్తింపును కాపాడుకోవాలనుకుంటున్నాం. అదే సమయంలో ఇండియా కూటమి ర్యాలీకి మేము మద్దతు తెలుపుతున్నాం. అంతేకాకుండా ఓట్ చోరీపై పోరాడే ఏ పార్టీకైనా మేము మద్దతు ఇస్తాం' అని దీప్కే వ్యాఖ్యానించారు.

దీప్కేపై మమత ప్రశంసలు

ఎన్నికల సంఘం, సర్ అక్రమాలపై అభిజీత్ దీప్కే, సీజేపీ నేతలు చేస్తున్న పోరాటం అభినందనీయమని మమతా బెనర్జీ అన్నారు. మీడియాతో ఆమె మాట్లాడారు. ఇండియా కూటమి ర్యాలీకి సీజేపీ నేతలు వారి పూర్తి మద్దతు తెలిపారని, ఆ ర్యాలీకి సంఘీభావం ప్రకటించారని ఆమె వెల్లడించారు. వారిని చూస్తే తనకు గర్వంగా ఉందన్నారు. ప్రస్తుత ఉద్యమానికి వారే మార్గదర్శకులు, వ్యవస్థాపకులు అని కొనియాడారు. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా పట్టు వదలకుండా పోరాడుతున్నారని చెప్పారు. బెంగాల్‌లోనూ అలాంటి కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు బెంగాల్‌కు రావాలని వారిని ఆమె ఆహ్వానించారు.

పులివెందులలో మళ్లీ టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

కప్పిపుచ్చుకునేందుకు టీడీపీపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించాయి. ఏజెంట్లను నియమించుకోవడం.. పోలింగ్ కేంద్రాలకు పంపించడం ఆయా పార్టీల బాధ్యత అని పేర్కొన్నాయి. తమ వైఫల్యాలను ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేయకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని హితవు పలికాయి. పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా.. పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నాయి. రాజకీయంగా ఎదుర్కోలేక అల్లర్లు, ఆరోపణల ద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారంటూ జగన్ తీరును తప్పుబట్టాయి. ఎన్నికల సమయంలో అనవసర ఆరోపణలు, వివాదాలకు తావివ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.



డీఎస్పీ బెదిరింపులు.. తిరగబడ్డ మహిళలు

ఓటర్లపై డీఎస్పీ మురళీ నాయక్ బెదిరింపులకు దిగారు. వెళ్లిపోండి.. ఓట్లు వేయొద్దు అంటూ బెదిరించిన డీఎస్పీ.. మీకు ఓటు వేసే హక్కు లేదంటూ ఓటర్లకు డీఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. ఓటర్లకు రక్షణ కల్పించకుండా పోలీసులు వెనక్కి పంపించారు.డీఎస్పీ మురళీ అడ్డగోలు వ్యాఖ్యలపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఓటర్లపై బెదిరింపులకు దిగిన డీఎస్పీ మురళీ నాయక్.. తప్పుడు సాకు చూపి ఓటర్లను అడ్డుకుంటున్నారు. దీంతో మహిళా ఓటర్లు నిలదీయడంతో డీఎస్పీ వెనుదిరిగారు. మేం కట్టెలు తెచ్చుకోలేదని.. మహిళా కానిస్టేబుళ్లే.. కట్టెలు తీసుకొచ్చారని ఓటర్లు చెబుతున్నారు. మరో వైపు, పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. మహిళా ఓటర్లను లాగిపడేస్తున్నారు. పులివెందులలో ఇస్లాంపురంలో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది. స్లిప్పులు లాక్కొని ఓటర్లను టీడీపీ గూండాలు వెనక్కి పంపిస్తున్నారు. ఓటు హక్కు కోసం జనం రోడ్కెక్కారు.. దీంతో రెచ్చిపోయిన టీడీపీ గూండాలు ఓటర్లపై రాళ్ల రువ్వారు.



పనిచేసే నాయకుడికే పట్టం కట్టాలి

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

పనిచేసే నాయకుడికే పట్టం కట్టాలని ప్రజలకు హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. అభివృద్ధి చేయని వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని వారికి స్పష్టం చేశారు. పార్టీలను కాదు.. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సూచించారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం చౌడేశ్వరి కాలనీ మూడో వార్డులోని.. మొదటి పోలింగ్ బూత్‌లో నందమూరి బాలకృష్ణ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది.. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల భవిష్యత్తును నిర్ణయించేది ఓటు అని వివరించారు. అందుకే ఆలోచించి ఓటు వేయాలన్న ఓటర్లకు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ సమానమేనని అన్నారు. ఎమ్మెల్యే అయినా సామాన్యుడైనా ఓటు విలువ ఒక్కటేనని చెప్పారు. ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ వద్ద సామాన్య ఓటరుతో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారుల



పోలింగ్ కేంద్రంలో కలకలం

ఫిట్స్ రావడంతో ఆసుపత్రికి తరలింపు..

సమయస్ఫూర్తితో స్పందించిన ఎస్ఐ అరుణ

గ్లోబల్ వార్త- చిలకలూరిపేట:

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓ బూత్ ఏజెంట్ అస్వస్థతకు గురయ్యాడు. పట్టణంలోని 38వ వార్డు, బూత్ నంబర్-1లో వైఎస్సార్‌సీపీ బూత్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న భూక్య రవి నాయక్‌కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో కుప్పకూలాడు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ అరుణ బాధితుడికి ప్రాథమిక సహాయం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ విధుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో బూత్ ఏజెంట్ అస్వస్థతకు గురికావడంతో అక్కడ కొంతసేపు ఆందోళన నెలకొంది. అయితే ఎస్ఐ అరుణ సకాలంలో స్పందించి బాధితుడిని ఆసుపత్రికి తరలించడంపై అక్కడున్న వారు పోలీసుల చర్యను అభినందించారు.



నిరంతర నిఘాలో ఎన్నికల ప్రక్రియ

సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో నిరంతర పర్యవేక్షణ: ఎన్నికల కమిషనర్

గ్లోబల్ వార్త – కొండపల్లి :

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలోని డీఏవీ పబ్లిక్ స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం సందర్శించిన ఆయన, క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఇప్పటివరకు నమోదైన పోలింగ్ వివరాలను ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే తాను పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించా నని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనానికి ప్రాధాన్యత ఇస్తూ పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, దీని ద్వారా పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



ఇరాన్‌లో మా టార్గెట్ ఇంకా పూర్తి కాలేదు: ట్రంప్

ఇరాన్‌లో తమ లక్ష్యం ఇంకా పూర్తికాలేదని, అక్కడ ఇంకా రెండు టార్గెట్లు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాము అనుకుంటే పది నిమిషాల్లో ఆ పనిని ముగించి వేయగలమని ఆయన పేర్కొన్నారు. తమపై దాడి చేస్తే, తాము కూడా తీవ్రంగా ప్రతిదాడి చేస్తామని ట్రంప్‌ను ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ తాజాగా స్పందించారు. శనివారం ఫ్లోరిడాలోని తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 'ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో ఉన్న పిక్ యాక్స్ పర్వతాన్ని మీరు చూసి ఉంటారు. ఆ పర్వతం గురించి ఇరాన్ పట్టించుకుంటే మంచిది. మేమనుకుంటే క్షణాల్లో ఆ పర్వతాన్ని నాశనం చేయగలం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈవారం ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించే అవకాశం ఉందా అని మీడియా ప్రతినిధులు అడగగా.. అలాంటి మూర్ఖపు ప్రశ్న ఎందుకు అడుగుతారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కాగా.. శాంతి ఒప్పం దంపై ఇరాన్‌తో సంప్రదింపులు సజావుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. అయితే, ఇరాన్‌ను నమ్మలేమని పేర్కొన్నారు.

మధ్యంతర ఎన్నికల తర్వాత మళ్లీ దాడులు?

అమెరికాలో ఈనెలలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్ ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. ఇటీవలే ఆయన అలా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై మరోసారి భీకర దాడి చేస్తాం అని గత వారం ట్రంప్ చెప్పారు. ఈనెల 3న అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై దాడులకు సిద్ధంగా ఉండాలని గల్ఫ్ అరబ్ దేశాలకు అమెరికా స్పష్టం చేసిందని, ఈ విషయాన్ని అధికార వర్గాలు తెలిపాయని ద వాల్ స్ట్రీట్ జర్నల్ గత నెల 28న వెల్లడించింది. తాము కోరుకుంటే ఇరాన్‌పై దాడి చేయగలమని అమెరికా విదేశాం గ మంత్రి మార్కో రుబియో కూడా వ్యాఖ్యానించారు.



అంతర్జాతీయ వేదికపై తెలుగు శాస్త్రవేత్త సత్తా

గ్లోబల్ వార్త- గుంటూరు

వ్యవసాయ రంగంలో సుస్థిర అభివృద్ధికి దోహదపడే వినూత్న పరిశోధనలు చేస్తున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సీనియర్ ప్రొఫెసర్ ఎ. అమృతవల్లికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. గోవాలో నిర్వహించిన 9వ ఏషియన్ పీజీపీఆర్ అంతర్జాతీయ సదస్సులో ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన 'అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్' పురస్కారాన్ని ప్రదానం చేశారు.ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వృక్ష-సూక్ష్మజీవ శాస్త్ర విభాగంలో సీనియర్ ఆచార్యురాలిగా పనిచేస్తున్న అమృతవల్లి గత మూడు దశాబ్దాలుగా ప్రయోజనకర సూక్ష్మజీవుల ఆధారంగా వ్యవసాయ రంగానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిపై పరిశోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా తక్కువ వ్యయంతో జీవ ఎరువులను తయారు చేసే సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ఆమె విశేష కృషి చేస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంపై ఆధారపడటాన్ని తగ్గించి, నేల సహజ పోషక సమతుల్యతను కాపాడటంతో పాటు రైతులకు ఆర్థికంగా భారంకాని ప్రత్యామ్నాయాలను అందించ చడమే ఆమె పరిశోధనల ప్రధాన లక్ష్యం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ వ్యవసాయాన్ని మరింత సుస్థిరంగా మార్చేందుకు ఆమె చేస్తున్న కృషి ప్రశంసలు అందుకుంటోంది. ఇప్పటికే జపాన్, తైవాన్ తదితర దేశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ విజ్ఞాన సదస్సుల్లో పాల్గొని తన పరిశోధనలను వివరించిన అమృతవల్లి, గతంలో జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా అందుకున్నారు. తాజాగా లభించిన అంతర్జాతీయ పరిశోధనా పురస్కారం ఆమె మూడు దశాబ్దాల శాస్త్రీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పరిశోధనలతో అంతర్జాతీయ వేదికపై తెలుగు మహిళా శాస్త్రవేత్త సత్తా చాటడం విశేషం. ఆమెకు లభించిన ఈ గౌరవం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలిచింది.



వైసీపీ నేతపై మంత్రి టీజీ భరత్ ఆగ్రహం

బండిమెట్ట పోలింగ్ కేంద్రంలో మంత్రి టీజీ భరత్ అభ్యంతరం
వైసీపీ నాయకుల తీరుపై మంత్రి ఆగ్రహం
ఎన్నికల నిబంధనలు అందరికీ సమానమే..
ఉల్లంఘనలను సహించేది లేదంటూ ఆగ్రహం

గ్లోబల్ వార్త – కర్నూలు

కర్నూలు నగరంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 4వ వార్డు బండిమెట్ట పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డు లేకుండానే వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉండటంపై రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలను పాటించకుండా పోలింగ్ కేంద్రంలో ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. బండిమెట్టలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడానికి, అక్కడ విధులు నిర్వహించడానికి లేదా ఉండటానికి నిర్దేశిత గుర్తింపు కార్డు అవసరమని మంత్రి పేర్కొన్నారు. అలాంటప్పుడు గుర్తింపు కార్డు లేకుండా ఒక నాయకుడు పోలింగ్ కేంద్రంలో ఉండటంపై ఆయన అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలు అత్యంత కీలకమైన ప్రాంతాలని, అక్కడ అనుమతి లేని వ్యక్తులు ఉండటం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘించే చర్యలను ఉపేక్షించకూడదని అన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుల వ్యవహారశైలిపై మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో క్రమశిక్షణ పాటించాల్సిన బాధ్యత అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించినట్లు సమాచారం. బండిమెట్ట పోలింగ్ కేంద్రంలో చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.



పులివెందులలో పోలింగ్ సెగ.. రాజకీయ రగడ

మున్సిపల్ పోలింగ్ వేళ పులివెందులలో ఉద్రిక్తత
వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు.. పలు చోట్ల తోపులాటలు
ఉలిమెల్లలో వాహనాలకు నిప్పు.. బీటెక్ రవి గృహనిర్భంధం

గ్లోబల్ వార్త- కడప జిల్లా:

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుండగా, పలు పట్టణాల్లో రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగి, ఘర్షణలకు పాల్పడుతున్న వారిని చెదరగొట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీలోని 18వ వార్డు యర్రగుడిపల్లి వద్ద వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. పోలింగ్ బూత్‌ల వద్దకు తమ పార్టీ ఏజెంట్లను అనుమతించడం లేదంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలై ఘర్షణకు దారితీసింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

మరోవైపు పులివెందుల సమీపంలోని ఉలిమెల్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పు పెట్టిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి తోట వద్ద నిలిపి ఉంచిన మూడు కార్లు, పది ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్‌కు నిప్పంటించినట్లు సమాచారం. ఈ ఘటనలో వాహనాలు పూర్తిగా దగ్ధమైనట్లు తెలుస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వాహనాలకు నిప్పు పెట్టిన వారిని గుర్తించాల్సి ఉంది. కడపలోని మానస కల్యాణ మండపం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు పోలింగ్ ఏజెంట్ల పత్రాలను చించివేయడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు.

పులివెందులలో టీడీపీ నాయకుడు బీటెక్ రవిని పోలీసులు గృహనిర్భంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించేందుకు వైఎస్ జగన్ కుట్ర పన్నారని ఆరోపించారు. బయట ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వ్యక్తులను పిలిపించారని, ఇప్పటికే పలు చోట్ల రాళ్ల దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. వరుస ఘటనల నేపథ్యంలో పులివెందులలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు అప్రమత్తమై భద్రతను కట్టుదిట్టం చేశారు. వాహనాల దహనం, ఘర్షణలకు సంబంధించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఎంపీ మాగుంట


ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి
ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని పిలుపు

గ్లోబల్ వార్త - ఒంగోలు:

ప్రకాశం జిల్లా ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కు విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఒంగోలు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్ ప్రక్రియలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటుండటంతో ఎన్నికల సందడి నెలకొంది.

జనసేనలో టికెట్ రగడ

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై రూ.50 లక్షల డిమాండ్ ఆరోపణలు
47వ డివిజన్ బీ-ఫామ్ వివాదంతో రాజేష్ ఆచారి ఆవేదన
పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



గ్లోబల్ వార్త - తిరుపతి

తిరుపతి జనసేన పార్టీలో కార్పొరేటర్ టికెట్ కేటాయింపు వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. 47వ డివిజన్ జనసేన కార్పొరేటర్ అభ్యర్థి రాజేష్ ఆచారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వచ్చిన సమాచారం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కార్పొరేటర్ టికెట్ కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రూ.50 లక్షలు డిమాండ్ చేశారని రాజేష్ ఆచారి ఆరోపించడం ఈ వ్యవహారంలో కలకలం రేపింది. తిరుపతిలో జనసేన పార్టీ తరఫున మొదటగా కార్పొరేటర్ అభ్యర్థి కార్యాలయాన్ని ప్రారంభించింది తానేనని రాజేష్ ఆచారి తెలిపారు. 47వ డివిజన్‌కు సంబంధించి నామినేషన్ దాఖలు చేసినప్పటికీ పార్టీ నుంచి బీ-ఫామ్ ఇవ్వకుండా తనకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సామాన్య కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తామని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చెబుతుండగా, తిరుపతిలో కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేయాలంటే రూ.50 లక్షలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని రాజేష్ ఆచారి భావోద్వేగానికి గురయ్యారు. తన పరిస్థితిని చూసైనా పార్టీ అధినేత స్పందించి తిరుపతికి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక ఎన్నికల వేళ జనసేనలో అభ్యర్థుల ఎంపికపై సొంత పార్టీ నాయకుడే బహిరంగంగా ఆరోపణలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా టికెట్ కేటాయింపులో డబ్బుల డిమాండ్ జరిగిందన్న ఆరోపణలు పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పందన తెలియాల్సి ఉంది. పార్టీ అధిష్ఠానం ఈ వివాదంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి

అనంతపురంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



గ్లోబల్ వార్త - అనంతపురం

అనంతపురం నగరంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. నగరంలోని మొత్తం 62 డివిజన్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అలజడులకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఈ సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి 43వ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియో గించుకున్నారు. అనంతరంఆయన మాట్లాడుతూ.. గత 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమ యంలో నగరంలో పెద్ద ఎత్తున దౌర్జన్యాలు, బెదిరింపులు చోటుచేసుకున్నాయని, ప్రజలను భయభ్రాంతు లకు గురిచేసి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం గా ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. గతంలో మాదిరిగా భయానక పరిస్థితులు ఈ సారి నగరంలో ఎక్కడా కనిపించడం లేదని, ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లు, భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునే పరిస్థితులు కల్పించామని తెలిపారు. నగరంలోని 62 డివిజన్లలోనూ ప్రశాంత వాతా వరణంలో పోలింగ్ జరుగు తుండటం ప్రజా స్వామ్యానికి శుభపరిణామమని పేర్కొన్నారు.

జగన్ రాజకీయ సమాధికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధం

ఎమ్మెల్యే ఆదినారాయణ



వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాజకీయ సమాధికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి పులివెందులతో సహా అన్ని చోట్లా ఘోర ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ కుట్రలు, డ్రామాల టైమ్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. త్వరలోనే ప్రజాస్వామ్యం గెలవబోతోం దని తెలిపారు. జమ్మలమడుగుకు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న తాను పులివెందుల్లో గూండాయిజం చేయడం ఏమిటని వైసీపీ నేతల ను ఆయన సూటిగా ప్రశ్నించారు. జగన్ అను కూల మీడియాలో తన పేరు పదేపదే ప్రస్తావిం చడం సరైనా పద్ధతి కాదని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గతంలో వైఎస్ వివేకానంద రెడ్డిని హత్య చేసి ఆ నేరం తమపై నెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పులివెందుల్లో వాళ్లే గుండాయిజం చేసి ఆ తప్పు తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

11 సీబీఐ, 9 ఈడీ కేసుల్లో ఉన్న దొంగలే నీతి నిజాయితీల గురించి మాట్లాడటం హాస్యా స్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక భయంతోనే తమపై కుట్రలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

పులివెందుల మునుపటిలా లేదు. మార్పు వచ్చింది

ఎమ్మెల్యే కృష్ణచైతన్య రెడ్డి



పులివెందుల మునుపటిలా లేదు. మార్పు వచ్చింది. అక్కడ ఎలాంటి గొడవలు జరగడం లేదు. పులివెందులకు వెళ్లి గలాటా చేసే వాళ్లు ఎవరూ లేరు.. సాక్షి మీడియాను అడ్డుపెట్టుకుని జగనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని కడప జిల్లా కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి ఆరోపించారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పులివెందులలో జగన్ మార్క్ మళ్లీ ప్రారంభమైంది. తాను చేసిన పాపాలను ఎదుటివారిపై నెట్టడం -- ఇదే జగన్ 2.0 మార్క్. సాక్షి మీడియాను అడ్డుపెట్టుకుని జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఓడి పోతామన్న భయంతోనే టీడీపీ నేతలు గలాటా చేస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. పులివెందు లకు వెళ్లి గలాటా చేసే వాళ్లు ఎవరూ లేరు. పులివెందులలో మార్పు వచ్చింది. అక్కడ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని కోరుకుంటు న్నాం. అవినాష్ రెడ్డి అబద్ధాలు చెప్పడం ఆపేస్తే మంచిది. బాబాయ్ హత్య కేసులో ఏమి జరిగిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు' అంటూ ఎమ్మెల్యే కృష్ణ చైతన్య కౌంటర్ ఇచ్చారు.



సొంత బాబాయ్‌ను చంపించి... మా జీవితాలు నాశనం చేశావ్

జగన్ ర్యాలీలో దస్తగిరి వ్యాఖ్యలు

పులివెందుల వీధుల్లో జగన్ చేపట్టిన ర్యాలీలో ఓ ఆకస్మిక సంఘటన చోటుచేసుకుంది. వివేకా హత్యకేసులో ప్రధాన నిందితుడు దస్తగిరి ర్యాలీకి ఎదురెళ్లాడు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న క్రమంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల వీధుల్లో ర్యాలీ చేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ నేత వివేకానంద రెడ్డి హత్యకేసులో ప్రధాన నిందితుడు దస్తగిరి ర్యాలీకి ఎదురెళ్లాడు. గమనించిన వైసీపీ అనుచరులు 'దస్తగిరి వచ్చాడు. దస్తగిరి వచ్చాడు' అంటూ జగన్‌కు సమాచారం అందించారు. ఇంతలోనే దస్తగిరి జగన్ ముందుకెళ్లి 'సొంత బాబాయ్ వివేకాను చంపించి.. మా జీవితాలు నాశనం చేశావ్' అంటూ వ్యాఖ్యానించాడు. దస్తగిరి మరింత ముందుకు వచ్చేందుకు ప్రయత్నించగా.. పోలీసులు నిలువరించి అతడిని పక్కకు పంపారు. ఆపై జగన్.. దస్తగిరిని చూసీ చూడనట్టుగా అక్కడ నుంచి వెళ్లిపోయారు.



పులివెందులలో వైసీపీ దౌర్జన్యాలపై టీడీపీ ధర్నా

గ్లోబల్ వార్త - పులివెందుల

పులివెందుల మున్సిపల్ కార్యాలయం వద్ద పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పలు వార్డుల్లో ఓటింగ్ జరగకుండా ఎంపీ అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి అడ్డంకులు సృష్టిస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారని బీటెక్ రవి ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ జగన్ ర్యాలీగా బయలుదేరి వచ్చి ధర్నా చేయడం, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్యలకు పాల్పడటం సరికాదని బీటెక్ రవి తీవ్రంగా విమర్శించారు. పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



చిత్తూరులో ప్రశాంతంగా పోలింగ్

సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గురజాల
చిత్తూరులో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరుగుతోంది
అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తం: ఎమ్మెల్యే

చిత్తూరు: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తన సతీమణి ప్రతిమతో కలిసి బాబు బాల భవన్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన చిత్తూరు నగరం లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగు తోందని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతున్నారని పేర్కొ న్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్నికలు ఏ విధంగా నిర్వహించారో ప్రజలం దరికీ తెలుసని, ప్రస్తుతం చిత్తూరులో అలాంటి పరిస్థితులు లేవని వ్యాఖ్యానించారు. చిత్తూరు నగరంలోని శంకరయ్య కుంట 31వ డివిజన్ పరిధిలోని ఒకటి, రెండు, మూడు పోలింగ్ బూత్ ల వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులు గందర గోళం సృష్టించేందుకు ప్రయత్నించారని ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే పోలీసులు సమయ స్ఫూర్తితో వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసు కున్నారని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందో ళనకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు.



బుల్లెట్‌పై కలెక్టర్ రైడ్..
పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి పరిశీలన!

గ్లోబల్ వార్త - నెల్లూరు

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా వినూత్నంగా బుల్లెట్ బైక్‌పై పర్యటించారు. నెల్లూరు నగరం లోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా మూలాపేట, మాగుంట లేఅవుట్‌లోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు డీఎస్ఆర్ హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శిం చారు. అక్కడ జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ తీరు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది విధుల నిర్వ హణకు సంబంధించిన వివరాలను అధికా రుల ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుల్లెట్‌పై పర్యటిస్తూ కలెక్టర్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మార్కాపురంలో వార్ వన్‌సైడే

కూటమిదే విజయమంటూ ఎమ్మెల్యే ధీమా
మాతృమూర్తితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న కందుల నారాయణరెడ్డి

గ్లోబల్ వార్త -మార్కాపురం

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అనుకూలంగా ఓటింగ్ సరళి కొన సాగు తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని, కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆదివారం మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో ఉన్న వెంకటేశ్వర పాఠశాలలో ఏర్పాటు చేసిన 37/1 పోలింగ్ బూత్‌లో తన మాతృమూర్తి నారాయణమ్మతో కలిసి ఎమ్మెల్యే కందుల నారా యణరెడ్డి ఓటు హక్కును వినియోగించు కున్నా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కా పురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్య ర్థుల కు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునతో పాటు 40 మంది కూటమి కౌన్సి లర్ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని విశ్వా సం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలే ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించడానికి కారణమని ఎమ్మెల్యే పేర్కొ న్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నా మని కందుల నారాయణరెడ్డి తెలిపారు.

వైఎస్ ప్రమీలమ్మపై దాడి



పులివెందులలో టీడీపీ గూండాలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిపై దాడి చేశారు. బూత్ నెం. 21 వద్ద ప్రమీలమ్మపై దాడికి పాల్పడ్డారు. వైఎస్ ప్రమీలమ్మ వాహనాన్ని టీడీపీ రౌడీలు ధ్వంసం చేశారు. కర్రలతో టీడీపీ గూండాలు బహిరంగంగా తిరుగుతున్న పచ్చ మూకలు.. పులివెందుల బూత్ 38 వద్ద కర్రలతో హల్‌చల్ చేశారు. పులివెందుల బూత్ నెం. 17 వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డగించి రిగ్గింగ్‌కు కుట్ర

పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ నేతలు తిష్ట వేశారని.. పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకుంటు న్నారంటూ ప్రమీలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిని నన్నే అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డగించి రిగ్గింగ్‌కు కుట్రకు తెరతీశారంటూ ఆమె మండిపడ్డారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు

రెచ్చిపోయిన వైసీపీ నేతలు, కార్యకర్తలు



గ్లోబల్ వార్త – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లోని 92 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఈ ఎన్నికల వేళ వైసీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు తెరలేపారు. దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నాలు, పోలీసులతో వాగ్వాదాలు, ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలపై దాడులు, పోలింగ్ కేంద్రాల్లో విధ్వంసం వంటి ఘటనలకు పాల్పడ్డారు. వైసీపీ శ్రేణుల తీరుతో పోలీసులు, ఓటర్లు, ప్రత్యర్థి పార్టీలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

విజయవాడలో దొంగ ఓట్ల కలకలం

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని 69వ డివిజన్ ముత్యాలంపాడులో దొంగ ఓట్ల వ్యవహారం కలకలం రేపింది. ఇప్పటికే ఒకసారి ఓటు వేసిన ఇద్దరు వ్యక్తులు మరోసారి ఓటు వేసేందుకు రావడంతో ఏజెంట్లు వారిని గుర్తించి పట్టుకున్నారు. పోలీసుల విచారణలో వైసీపీ నాయకులే తమను పంపినట్లు నిందితులు అంగీకరించినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆదోనిలో వైసీపీ నేతల వాగ్వాదం

కర్నూలు జిల్లా ఆదోని డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు హంగామా సృష్టించారు. వైసీపీ ఎమ్మెల్సీ మధుసూదన్, జయ మనోజ్ రెడ్డి నేతృత్వంలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ జరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు ఉన్నారని, అలాంటిదేమీ జరగడం లేదని పోలీసులు వారికి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైసీపీ నేతలు గుంపులుగా చేరడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు.

ఎమ్మిగనూరులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు 10వ వార్డులోని పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ రెబల్ స్వతంత్ర అభ్యర్థి నజీర్ అహ్మద్ వర్గీయులు, టీడీపీ అభ్యర్థి వర్గీయుల మధ్య గొడవ జరిగింది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

అనంతపురం 45వ డివిజన్‌లో నిలిచిన పోలింగ్

అనంతపురంలోని 45వ డివిజన్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పులివెందుల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఎన్నికల సామగ్రిని ధ్వంసం చేసినట్లు సమాచారం. టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి దాదా కలందర్‌పై దాడి చేసి తల పగలగొట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ కార్యకర్తలపైనా దాడులు జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో అధికారులు 45వ డివిజన్‌లో పోలింగ్‌ను నిలిపివేశారు. పోలింగ్ అధికారులు ఏజెంట్లతో చర్చలు జరుపుతుండగా.. టీడీపీ అభ్యర్థిపై దాడిని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో సుమారు 45 నిమిషాల పాటు పోలింగ్ ప్రక్రియ నిలిచి పోయింది.

మార్కాపురం వైసీపీ అధ్యక్షుడి అరెస్ట్

మార్కాపురంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే కారణంతో వైసీపీ పట్టణ అధ్యక్షుడు సలీంను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్‌ను నిరసిస్తూ వైసీపీ ఇన్‌ఛార్జ్ అన్నా రాంబాబు, వైసీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కనకదుర్గ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

తిరుపతి 60వ వార్డులో ఉద్రిక్తత

ఇండిపెండెంట్ అభ్యర్థి ఆదం సుధాకర్ రెడ్డి వర్గీయులు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ జనసేన శ్రేణులు ఆరోపించాయి. అనుమానాస్పద ఓటర్లను అడ్డుకోవడంతో జనసేన అభ్యర్థి ఆకేపాటి సుభాషిణి, ఆదం సుధాకర్ రెడ్డి వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తనను ఓడించేందుకు దొంగ ఓట్లు వేస్తున్నారంటూ సుభాషిణి ఆరోపించారు.



రాప్తాడు పారశాల విద్యార్థినిపై దాడి కేసు నిందితుడు

హేమంత్‌పై పోలీసుల కాల్పులు

గ్లోబల్ వార్త – అనంతపురం జిల్లా:

రాప్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై చెట్లు నరికే రంపం యంత్రంతో హేమంత్ దాడి చేశాడు. బాలిక తీవ్రంగా గాయపడటంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి ఆ యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే, ఆత్మకూరు అడవుల్లో నిందితుడు ఉన్నాడనే పక్కా సమాచారంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వారికి అతను తారసపడగా.. తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపినట్లు సమాచారం. పోలీసుల కాల్పుల్లో యువకుడికి గాయాలైనట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

పులివెందులలో వైసీపీ అరాచకాలు



గ్లోబల్ వార్త – పులివెందుల

జిల్లాలో పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే ఓడిపోతామనే భయంతోనే జగన్ మోహన్ రెడ్డి అల్లర్లకు తెర లేపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రౌడీ మూకలను పులివెందులకు తీసుకొచ్చి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండి పడ్డారు. పోలీసులను సైతం లెక్కచేయకుండా వైసీపీ శ్రేణులు వ్యవహరిస్తున్నాయని అన్నారు. వైసీపీ నాయకులు తమ వాహనాలను తామే తగలబెట్టుకుని ఆ నెపాన్ని టీడీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో వంద లాది మందిని పులివెందులకు ఎందుకు తీసుకొచ్చారు? అక్కడ వాహనాలను ఎందుకు నిలిపారు? అని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి అరాచక రాజకీయాలను ప్రజలు గమనించాలని, ఎలాంటి భయాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు ను వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి పిలుపు నిచ్చారు.

ఓటమి భయంతోనే అల్లర్లు



గ్లోబల్ వార్త – పులివెందుల

పులివెందుల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ వైసీపీ నాయకులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేత భూపేశ్ రెడ్డి ఆరోపించారు. రౌడీ మూకలను పులి వెందులకు తీసుకొచ్చి కావాలనే ఘర్షణలు సృష్టిస్తు న్నారని మండిపడ్డారు. గతంలో బాబాయ్ హత్యను టీడీపీపై నెట్టే ప్రయత్నం చేసినట్లుగానే, ప్రస్తుతం కార్లకు నిప్పుపెట్టి ఆ నెపాన్ని కూడా టీడీపీపై మోపేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు అల్లర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్‌మోహన్ రెడ్డి చొక్కా మడతపెడతానంటూ చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగానే పులివెందుల్లో ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. జమ్మలమడుగులో ప్రశాంతంగా ఎన్నికలు జరగడం కూడా జగన్‌కు ఇష్టం లేదని విమర్శించారు.



పులివెందులలో హైటెన్షన్

పులివెందులలో జగన్ కాన్వాయ్‌కు దస్తగిరి అడ్డంకి

పోలీసులకు దస్తగిరికి మధ్య వాగ్వాదం.. తోపులాట

కాన్వాయ్ వాహనం ధ్వంసం.. డీఎస్పీ స్థాయి అధికారికి గాయాలు

గ్లోబల్ వార్త– కడప జిల్లా, పులివెందుల

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పులివెందులలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్‌ను వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి అడ్డుకున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. జగన్ తన నివాసానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో దస్తగిరి ఇంటి వద్దకు చేరుకోగానే దస్తగిరి తన వాహనాన్ని అడ్డుగా పెట్టి కాన్వాయ్‌ను నిలువరించినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులకు, దస్తగిరికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జగన్ కాన్వాయ్‌లోని ఓ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో డీఎస్పీ స్థాయి పోలీసు అధికారికి గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, వాహనం ధ్వంసం వెనుక ఉన్న వారి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రంలో అరాచకాలకు జగన్ కుట్ర

పెనుకొండలో ఓటేసిన మంత్రి సవిత



గ్లోబల్ వార్త – పెనుకొండ

'రాష్ట్రంలో ఘర్షణలు సృష్టించడానికే జగన్ రెడ్డి కుట్రలు పన్నారు... పులివెందులలో అలజడి సృష్టిస్తే రాష్ట్రవ్యాప్తంగా గొడ్డలి పార్టీ శ్రేణులు రెచ్చిపోతాయనేది ఆయన భావన ... అందుకే ఎన్నికల నిబంధనలకు పాతరేస్తూ పులివెందులలో రోడ్ షో చేశారు. ప్రజాస్వామ్యం గురించి స్క్రిప్ట్ చదువుతూ గొడ్డలి పార్టీ నాయకుడు మాట్లాడుతుంటే జనాలు నవ్వుకుంటున్నారు... వైసీపీ గూండాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజాస్వామ్యంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీలకు పట్టంకట్టబోతున్నారు...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మున్సిపాల్టీలోని 18 వార్డులోని శాంతినికేతన్ హైస్కూల్‌లో మంత్రి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని చోట్లా ఓటర్లు అభివృద్ధికి పట్టం కడుతూ, కూటమి పార్టీల అభ్యర్థులకు ఓట్లేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు రాష్ట్రంలో ట్రిపుల్ సర్కార్ ఏర్పాటుతో పంచాయతీ, మున్సిపాల్టీల్లోనూ అభివృద్ధి మరింత ఊపందుకుంటుందన్నారు. పెనుకొండలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తి, ఆయా వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో విజయం సాధించబోతున్నట్లు తెలిపారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని, కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని మంత్రి సవిత కోరారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన జగన్

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ, పోలింగ్ రోజున పులివెందులలో జగన్ రోడ్డ్ షో నిర్వహించడంపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి ఎన్నికల నిబంధనలు తెలియవా..? అంటూ నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్ రాష్ట్రంలో ఘర్షణలకు కుట్ర పన్నారన్నారు. పులివెందులలో ఘర్షణల రేగడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అరాచకాలకు పాల్పడతాయని ఆయన రోడ్ షో చేశారని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా జగన్, గొడ్డలి పార్టీ నాయకులు వ్యవహరించారన్నారు. స్క్రిప్ట్ చదువుతూ, జగన్ ప్రజాస్వామ్యం, గుండాయిజం గురించి మాట్లాడుతుంటే జనాలు నవ్వుతున్నారన్నారు.

లైన్లో నిల్చోని...ఓటేసి...

అంతకుముందు మంత్రి సవిత ఓటేయడానికి 18 వార్డులోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. మంత్రి అని దర్పం చూపకుండా, క్యూలో నిల్చొని, తన వంతు వచ్చిన తరవాతే ఓటేశారు. మంత్రి సవిత నిరాండబరతను చూసి, ఓటేయడానికి వచ్చిన ఓటర్లు ప్రశంసలు కురిపించారు. విలేకరులతో మాట్లాడిన సమయంలో మంత్రి సవిత వెంట టీడీపీ చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తి, పలువురు వార్డు అభ్యర్థులు ఉన్నారు.

ఇషాన్ కిషన్ ఖాతాలో అరుదైన ఘనత



న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదో టీ20లో వన్‌డౌన్‌లో వచ్చిన భారత బ్యాటర్ ఇషాన్ కిషన్ మరో రికార్డు తన ఖాతాలో వేసుకున్నాడు. నాలుగో టీ20లో డకౌట్ అయిన ఇషాన్.. ఇవాళ జరుగుతున్న ఆఖరి మ్యాచ్‌లో మాత్రం దుమ్మురేపాడు. 28 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. ఈ క్రమంలోనే ఇషాన్ 2 వేల పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే ఇషాన్ ఒక అరుదైన ఫీట్ సాధించాడు. టీమిండియా తరఫున అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 2వేల పరుగులు పూర్తి చేయడానికి తక్కువ బంతులు తీసుకున్న మూడో బ్యాటర్‌గా ఈ పాకెట్ డైనమట్ నిలిచాడు. ఇషాన్ 1345 బంతుల్లో 2వేల పరుగుల మార్క్ చేరుకున్నాడు. ఈ జాబితాలో అభిషేక్ శర్మ (1024 బంతులు) అగ్రస్థానంలో ఉండగా, సూర్యకుమార్ యాదవ్ (1164 బంతులు) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇదే సమయంలో ఇషాన్ మరో రికార్డు కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక క్యాలెండర్ ఇయర్‌లో భారత్ తరఫున టీ20ఐ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ఇషాన్ నిలిచాడు. గతంలో సూర్యకుమార్ యాదవ్ 2022 ఏడాదిలో 1164 పరుగులు సాధించాడు. తాజాగా సూర్య రికార్డును బ్రేక్ చేసిన ఇషాన్ ఈ ఏడాది క్యాలెండర్ ఇయర్‌లో 1220 పరుగులు సాధించాడు.

అర్ధ సెంచరీలతో రాణించిన ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్

హామిల్టన్ వేదికగా భారత్–న్యూజిలాండ్ జట్లు ఐదో టీ20 జరుగుతోంది. టాస్ నెగ్గిన కివీస్.. ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేంది. ఇషాన్ కిషన్(61), శ్రేయస్ అయ్యర్(50) అర్ధ సెంచరీలతో రాణించారు. ఓపెనర్లు సంజూ శాంసన్(4), అభిషేక్ శర్మ(1) విఫలమయ్యారు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో కలిసి స్కోర్ బోర్డును కదిలించాడు. నమన్ ధిర్ 33, నితీశ్ కుమార్ రెడ్డి 22 పరుగులతో ఫర్వాలేదనిపించారు. ఇక కివీస్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 4, నాథన్ స్మిత్ 2, టిక్నెర్ 2 వికెట్లు తీశారు. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకుంది. ఈ ఆఖరి మ్యాచ్‌లో గెలిచి.. సిరీస్‌ను విజయంతో ముగించాలనే పట్టుదలతో ఉంది. నాలుగో టీ20లో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. తిరిగి జట్టులో చేరాడు. ఇప్పటి వరకు ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి అవకాశం దక్కింది.

భువీని జట్టు నుంచి తప్పించడం సరైన నిర్ణయం కాదు: మహ్మద్ కైఫ్



న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకున్న టీమిండియా.. నాలుగో మ్యాచ్‌లో మాత్రం విఫలమైంది. ఈ నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న ఓ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. నాలుగేళ్ల తర్వాత టీ20 జట్టులోకి తిరిగి వచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు వరుసగా అవకాశాలు ఇవ్వకుండా కేవలం మూడు మ్యాచ్‌లకే పక్కన పెట్టడాన్ని తప్పుబట్టాడు. గౌతమ్ గంభీర్, శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ తొందరపాటు నిర్ణయం తీసుకుందని విమర్శించాడు. 'నాలుగో టీ20లో భువనేశ్వర్‌ను జట్టు నుంచి తప్పించడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇరు జట్లలో కలిపి కనీసం 10-11 మంది బౌలర్లు ఉన్నారు. వారిలో దాదాపు అందరూ భారీగా పరుగులు సమర్పించుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ పరుగులు ఇస్తున్నప్పుడు ఒక్క భువనేశ్వర్‌నే ప్రత్యేకంగా ఎందుకు తప్పించాలి? నాకు ఈ నిర్ణయం అర్థం కావడం లేదు. నాలుగేళ్ల తర్వాత అతడు భారత జట్టులోకి తిరిగొచ్చాడు. పైగా అప్పటికే సిరీస్‌ను మనమే గెలుచుకున్నాం. ఇదేమీ డూ ఆర్ డై మ్యాచ్ కాదు కదా! ఇలాంటి పరిస్థితుల్లో మార్పు చేయాల్సిన అవసరం ఏముంది? అతడికి ఐదు మ్యాచ్‌ల సిరీస్ మొత్తం అవకాశమిచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోవాల్సిందే. మూడు మ్యాచ్‌లకే తప్పించడం సరైన పద్ధతి కాదు.

భువనేశ్వర్ సామర్థ్యం ఏమిటో అందరికీ తెలుసు. రెండు, మూడు మ్యాచ్‌ల్లో సరిగా బౌలింగ్ చేయకపోయినా అతడికి అండగా నిలవాలి. జట్టులో బుమ్రా కూడా లేడు. మిగతా బౌలర్లంతా కొత్తవాళ్లే. భువనేశ్వర్ నుంచి ఆశించిన ప్రదర్శన రాలేదన్న విషయం నిజమే. ఆ విషయం అతడికి కూడా తెలుసు. కానీ పరుగులు సమర్పించుకుంటున్నది అతడు ఒక్కడే కాదు. ఐదు మ్యాచ్‌ల్లోనూ అవకాశం ఇచ్చి ఉంటే అతడి ప్రదర్శనపై స్పష్టమైన అంచనాకు వచ్చేవాళ్లం. ఇది టీమ్ మేనేజ్‌మెంట్ తొందరపాటు నిర్ణయం' అని కైఫ్ అభిప్రాయ పడ్డాడు. కాగా ఆదివారం న్యూజిలాండ్‌తో ఐదో టీ20 జరగనుంది. ఇందులో భువీకి అవకాశం దక్కుతుందా? లేదా? అనేది చూడాల్సి ఉంది.



ఆఖరి టీ20: టాస్ నెగ్గిన న్యూజిలాండ్.. భారత్ బ్యాటింగ్

హామిల్టన్ వేదికగా భారత్–న్యూజిలాండ్ జట్లు ఐదో టీ20లో తలపడనున్నాయి. టాస్ నెగ్గిన కివీస్.. ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకుంది. ఈ ఆఖరి మ్యాచ్‌లో గెలిచి.. సిరీస్‌ను విజయంతో ముగించాలనే పట్టుదలతో ఉంది. నాలుగో టీ20లో జట్టుకు దూరమైన స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. తిరిగి జట్టులో చేరాడు. ఇప్పటి వరకు ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి అవకాశం దక్కింది.

భారత తుది జట్టు: శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), సంజు శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వరుణ్ చక్రవర్తి

కివీస్ తుది జట్టు: మిచెల్ శాంట్నర్(కెప్టెన్), టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), ఫిన్ అలెన్, డారిల్ మిచెల్, ఫిలిప్స్, జాకబ్స్, బ్రేస్‌వెల్, స్మిత్, మిల్నే, డఫీ, బ్లెయిర్



ఫైనల్‌కు సింధు, లక్ష్యసేన్

సార్‌బ్రూకెన్ (జర్మనీ): సూపర్‌ఫామ్‌లో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు వారంలోపే రెండో టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. గతవారం ఫ్రెంచ్ ఓపెన్ రన్నర్‌పగా నిలిచిన ఈ తెలుగు షట్లర్ తాజాగా హైలో ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో టైటిల్ ఫైట్‌కు చేరుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ సింధు 21-13, 21-16తో భారత్‌కే చెందిన యువ షట్లర్ అన్మోల్ ఖర్బ్‌ను వరుస గేముల్లో ఓడించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరులో సింధు కేవలం 38 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. ఆదివారం జరిగే తుది పోరులో డెన్మార్క్ షట్లర్, 8వ సీడ్ లినె హోజ్‌మార్క్ జేర్‌ఫెల్ట్‌తో సింధు అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీ?సలో హోజ్‌మార్క్ 8-21, 21-19, 28-26తో టాప్‌సీడ్ పోర్న్‌పవీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను కంగుతినిపించింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ ఫైనల్ చేరి భారత అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేశాడు. సెమీఫైనల్లో ఏడో సీడ్ లక్ష్యసేన్ 21-17, 21-13తో ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ టోమా జూనియర్ పొపోవ్‌ను చిత్తు చేశాడు. టాప్‌సీడ్ ఆండ్రెస్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), నాలుగో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో లక్ష్యసేన్ ఫైనల్లో తలపడతాడు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480